సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 9 । జనవరి । 2025



గురుకులాలు పిలుస్తున్నాయి..

2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు గురుకులాలు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాయి.

8లో



...ముగ్గురి మృతి

పినపాక నియోజకవర్గంలో బుధవారం జరిగిన మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు.

8లో

గరిష్టం / కనిష్టం
30° / 15°

వాతావరణం

జిల్లాలో గురువారం మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

వీసీకి హాజరైన కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్రంలో మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ క్యాంపు కార్యాలయం నుంచి వీసీకి హాజరయ్యారు. స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్‌ప్లాంట్‌లు ఏర్పాటు చేసి 1000 మెగావాట్ల విద్యుదుత్పత్తికి ఇప్పటికే ఇంధన శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖలకు ఒప్పందం కుదిరిన నేపథ్యంలో జిల్లాల వారీగా ప్రగతిని బుధవారం మంత్రులు సీతక్క, కొండ సురేఖలతో కలిసి ఉప ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించాలి

- జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి



అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

చంద్రుగొండ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందేలా అధికారులు పనిచేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నాగలక్ష్మి సూచించారు. బుధవారం ఆమె ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించారు. మండలస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మేలు జరిగేలా చూడాలన్నారు. కార్యాలయ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్, ఎంపీడీఓ బయ్యారపు అశోక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ, ఉద్యోగులు పెన్షనర్ల సమస్యల పరిష్కారం, అభ్యున్నతే లక్ష్యమని పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కొత్తగూడెంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన మండల అధ్యక్షకార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఏ రాజకీయ పార్టీకీ వత్తాసు పలకకుండా, కేవలం సమస్యల పరిష్కారానికే కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, నాయకులు జహంగీర్ షరీఫ్, నర్సయ్య, రవీందర్, ఆరిఫ్, శ్రీనివాసరావు, సంగమేశ్వర్‌రావు, మండల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలి

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

చర్ల: ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలని, విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని ఏహెచ్ఎస్ ఉంజుపల్లి, ప్రభుత్వ జూనియర్ కళాశాల, తేగడలోని జిల్లా పరిషత్ హైస్కూళ్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి మైదాన ప్రాంతానికి డిప్యూటేషన్‌ను అనుమతించవద్దని కోరారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



నాగవర్షిత్

పాల్వంచరూరల్: మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లిలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల ఇంటర్ విద్యార్థి వి.నాగవర్షిత్ జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 6న హైదరాబాద్‌లోని బోట్ క్లబ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభ చూపి ప్రథమస్థానంలో నిలిచాడు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు ఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి యూత్ ఫెస్టివల్‌కు ఎంపికయ్యాడు. విద్యార్థితోపాటు ఆర్ట్ ఉపాధ్యాయుడు సుభాష్‌ను ప్రధానాచార్యుడు అనిల్‌కుమార్, ఉపప్రధానాచార్యుడు అన్వేశ్, అధ్యాపకులు ఎస్. నాగేశ్వరరావు, ఆర్.కృష్ణ, సరోజ బుధవారం అభినందించారు.

కమనీయం.. శ్రీ కృష్ణావతారం



తెప్పోత్సవానికి సిద్ధమైన హంస వాహనం

వైభవోపేతంగా కిట్టయ్యకు ఊంజల్‌సేవ

- ముగిసిన స్వామివారి అవతారాలు

భద్రాచలం: ముగ్ధమనోహరమైన రూపం.. చూడచక్కని ఆకారం.. కిరీటంపై నెమలి ఈకలతో చెంతనే సీతామహాదేవి.. ఆ పక్కనే లక్ష్మణస్వామితో బంగారపు ఊయలలో ఊగుతున్న శ్రీకృష్ణావతారంలో రామయ్య.. కమనీయమైన ఈ దృశ్యాన్ని వీక్షించిన భక్తులు తన్మయత్వం పొందారు. వైకుంఠ ఏకాదశీ అధ్యయనోత్సవాల్లో భాగంగా రామాలయంలో పగల్‌పత్తు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. స్వామివారు బుధవారం శ్రీకృష్ణావతారంలో దర్శనమిచ్చారు. గత నెల 31న ప్రారంభమైన స్వామివారి అవతారాలు ఈ నెల 8వ తేదీతో ముగిశాయి. తొలుత స్వామివారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవతారాల్లో భాగంగా శ్రీ కృష్ణావతారుడైన రామయ్యకు వైభవోపేతంగా ఊంజల్ సేవ జరిపారు. ఈ సందర్భంగా ఆస్థాన విద్వాంసులు కీర్తనలు ఆలపిస్తుండగా ఆలయ అర్చకులు శ్రీకృష్ణుడైన రామయ్యను ఊయల్లో ఊపుతూ వేద మంత్రాలు చదివారు. అనంతరం హారతిని సమర్పించారు. డోలోత్సవంలో పాల్గొని స్వామివారిని చూసి తరించిన భక్తులకు వెయ్యి అశ్వమేధయాగ ఫలాలకు దక్కినంత పుణ్యం, సర్వ పాపాలు తొలగి సుఖసంతోషాలు లభిస్తాయని పండితులు వివరించారు. వెన్న, అటుకులు, బెల్లం భక్తులు తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. వీటిని స్వామివారికి నివేదన ఇచ్చి ఆ తర్వాత భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణం రామనామస్మరణతో మార్మోగింది. స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తజనంతో పండుగ శోభ సంతరించుకుంది. అనంతరం స్వామివారిని పల్లకీపై ఊరేగింపుగా కోలాటాలు, మేళతాళాలు నడుమ మిథిలా స్టేడియంలోని వేదికపైకి తీసుకొచ్చి ఆశీనులు చేశారు. భక్తుల దర్శనార్థం తిరువీధి సేవ ఘనంగా జరిపారు. ఆస్థాన మండపంలో స్వామివారికి దర్బార్ సేవ, ఆరాధన, నివేదన ఇచ్చి స్వామివారికి పవళింపు సేవ జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు గోదావరిలో విహారం..

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు స్వామి వారు సీతా లక్ష్మణ సమేతంగా పవిత్ర గోదావరి నదిలో హంసవాహనంపై విహరించనున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ రెండు వేడుకలను కనులారా తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి ఇప్పటికే భారీ సంఖ్యలో భక్తులు భద్రాచలం చేరుకున్నారు. వారికి తగిన వసతి, సౌకర్యాల కల్పనకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.





భద్రాచలంలో ఉత్సవాలకు హాజరైన భక్తులు (ఇన్‌సెట్) కృష్ణావతారంలో భద్రాద్రి రామయ్య

నేడు తిరుమంగైళ్వార్ పరమపదోత్సవం

శ్రీ సీతారామ చంద్రస్వామివారి ఆలయంలో గురువారం తిరుమంగై ఆళ్వార్ పరమపదోత్సవం జరగనుంది. రామాలయంలోని ఆస్థాన మండపంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. తిరుమంగై ఆళ్వార్ స్వామివారి పాదాల చెంత పరమపదించి అనంతరం స్వామివారి అనుగ్రహంతో జీవం పోసుకుంటారు. ఈ నేపథ్యంలోనే ప్రతీ ఏటా తెప్పోత్సవం రోజు ఆలయంలో ఈ ఉత్సవం నిర్వహించటం ఆనవాయితీ.

నేటి కార్యక్రమాలు

- ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సేవాకాలం, తిరుమంగై ఆళ్వారుల పరమపదోత్సవం
- మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2గంటల వరకు రాజభోగం, శాత్తుముర్రై, పూర్ణ శరణాగతి సేవ, పగల్‌పత్తు సమాప్తి
- మధ్యాహ్నం 3గంటలకు దర్బారుసేవ
- సాయంత్రం 4 గంటల నుంచి 5గంటల వరకు స్వామివారిని ఊరేగింపుగా గోదావరి నదీ వద్దకు చేర్చుతారు.

ముక్కోటికి సిద్ధం



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

- నేడు తెప్పోత్సవం, రేపు ఉత్తర ద్వార దర్శనం
- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

భద్రాచలం: భద్రాచలంలో గురువారం జరిగే తెప్పోత్సవం, శుక్రవారం తెల్లవారుజామున జరిగే ఉత్తర ద్వార దర్శనాలకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. బుధవారం గోదావరి తీరం, ఉత్తర ద్వార దర్శనం, స్టాళ్ల ఏర్పాటు తదితర ప్రదేశాలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం సబ్ కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఉత్తర ద్వార దర్శనం రోజున అధికారులు తెల్లవారుజామున 3 గంటల నుంచే విధుల్లో ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీసులు సైతం మర్యాదగా నడుచుకోవాలని ఆదేశించారు. ఈ ఏడాది చేపట్టిన ఏరు ఉత్సవాన్ని ఆదివాసీల కార్యక్రమంగా రూపొందించామని తెలిపారు. బుధవారం నుంచి 11వ తేదీ వరకు గిరిజన కల్చరల్ ప్రోగ్రామ్స్ గోదావరి తీరంలో వేదికపై ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. గిరిజన వంటకాలు, గోదావరిలో బోట్ సౌకర్యం, ఐటీడీఏలోని ట్రైబల్ మ్యూజియం పర్యాటకుల కోసం ప్రత్యేకంగా గోదావరి పక్కన ప్రత్యేక క్యాంపెయింగ్ ఏర్పాటు చేశామని, ఇది కొనసాగింపు కార్యక్రమంలా మారుస్తామని వెల్లడించారు. రివర్ ఫెస్టివల్ విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీఓ దామోదర్ రావు, రామాలయ ఈఓ రమాదేవి, భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

భారీ బందోబస్తు



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

భద్రాచలంఅర్బన్: తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం వేడుకల్లో ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ఠ బందోబస్తు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ రోహిత్‌రాజ్ తెలిపారు. బుధవారం భద్రాచలం ఏఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. గోదావరి తీరం, దేవాలయ ప్రాంగణం, బస్టాండ్, ప్రధాన రహదార్లలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిర్దేశిత ప్రాంతాల్లోనే వాహనాలను పార్కింగ్‌కు అనుమతించాలన్నారు. వేడుకల్లో 1,300 మంది పోలీసులు విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఒక అడిషనల్ ఏఎస్పీ, 10 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు, 80 మంది ఎస్సైలు, 917 మంది సివిల్, 6 స్పెషల్ పార్టీలు, 6 సెక్షన్లకు చెందిన 11 సీఆర్‌పీఎఫ్ బృందాలు, 4 బీడీ టీంలతో కలిపి మొత్తం 1,300 మంది బందోబస్తులో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఏరు ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి



గిరిజనుల వంటకాలు



విక్రయానికి ఉంచిన కళాఖండాలు

భద్రాచలంటౌన్: ఆదివాసీ గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా ఏరు ఉత్సవాని(రివర్ ఫెస్టివల్)కి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భద్రాచలం వచ్చే భక్తులు, పర్యాటకులకు ఆదివాసీల ఆచారవ్యవహారాలు తెలిసేలా రెండు రోజులపాటు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ప్రత్యేక చొరవతో కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసి ఆయా ప్రదేశాల్లో ఆదివాసీల వస్తువులు, కట్టడాలు, వంటకాలతో పల్లె తరహాలో ఏర్పాటు చేశారు. పర్యాటకుల సందర్శనకు బొజ్జిగుప్ప, కిన్నెరసాని, బెండాలపాడుతో పాటు ఐటీడీఏ గిరిజన మ్యూజియంలో, గోదావరి తీరంలో విడిది గృహాలను, ఆదివాసీ వంటకాలను వడ్డించేలా ఏర్పాట్లు చేశారు. నదీ విహారానికి బోట్లు అందుబాటులో ఉంచారు. తీరంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు స్టేజీ సిద్ధం చేశారు. స్నాన ఘట్టాల ప్రాంతంలో ప్రత్యేక గుడారాలు ఏర్పాటు చేసి ఆదివాసీల వస్తువులు, వంటకాలను సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల మహిళల ద్వారా విక్రయించేందుకు స్టాళ్లు ఏర్పాటు చేశారు. ప్రత్యేక ప్రదేశాల సందర్శనకు వెళ్లే భక్తుల కోసం ప్యాకేజీగా రూ.6 వేలు నిర్ణయించారు.



నదీ తీరంలో ఏర్పాటు చేసిన విడిది గృహాలు

తుమ్మల చెరువులో బోటింగ్..

నేడు ప్రారంభించనున్న కలెక్టర్, ఎమ్మెల్యే

అశ్వాపురం: కాకతీయుల కాలంనాటి తుమ్మల చెరువు పర్యాటక ప్రాంత అభివృద్ధిలో నేడు తొలి అడుగు పడనుంది. గురువారం తుమ్మలచెరువులో బోటింగ్ కార్యక్రమాన్ని కలెక్టర్ జితేష్ వి.పాటిల్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించనున్నారు. ప్రసిద్ధి చెందిన తుమ్మల చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో ప్రతిపాదనలు రూపొందించారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో పర్యాటకంగా అభివృద్ధి చెందలేదు. స్థానికుల విన్నపం, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ప్రత్యేక చొరవతో తుమ్మల చెరువు పర్యాటకాభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. కాగా సీతారామ ప్రాజెక్ట్‌లో భాగంగా మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా తుమ్మల చెరువుకు గోదావరి జలాలు అందించనున్నారు. ఎత్తిపోతల పథకం పూర్తయి గోదావరి జలాలు తరలిస్తే చెరువులో 365 రోజులపాటు నీరు పుష్కలంగా ఉంటుంది. ఆయకట్టు 10 వేల ఎకరాల్లో రెండు పంటలతోపాటు ఈ ప్రాంతం పర్యాటకంగా మరింత అభివృద్ధి చేందే అవకాశం ఉంది.



తుమ్మల చెరువు

త్వరితగతిన వ్యవసాయ కనెక్షన్లు..

విద్యుత్ ఎస్ఈ మహేందర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతులకు ప్రత్యేక కార్యాచరణ ద్వారా యుద్ధ ప్రాతిపదికన వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నామని విద్యుత్ ఎస్ఈ జి.మహేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం జనవరి 1వ తేదీ నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు 3,704 సర్వీసులు మంజూరు చేశామని, డిసెంబర్‌లోనే 428 కనెక్షన్లు ఇచ్చామని వివరించారు. ఆన్‌లైన్ చేయడంతో వ్యవసాయ సర్వీసుల మంజూరు ప్రక్రియలో జాప్యాన్ని నివారిస్తున్నట్లు తెలిపారు. ఈ–స్టోర్ విధానం ద్వారా మెటీరియల్‌ను ఆన్‌లైన్ ద్వారా రిజర్వ్ చేసుకోగానే మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులకు మరింత చేరువయ్యేలా పొలంబాట కార్యక్రమం చేపట్టామని వివరించారు.

ఖాళీ ప్రదేశాల్లోనే పతంగులు ఎగురవేయాలి

విద్యుత్‌లైన్లకు దూరంగా ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే పతంగులు ఎగురవేయాలని విద్యుత్ ఎస్ఈ జి.మహేందర్ తెలిపారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎగురవేస్తే మాంజా దారాలు వాటిపై పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. చైనా మాంజాలు అసలు వాడొద్దని తెలిపారు.

ఐటీసీలో 'గుర్తింపు' సమరం

- మోగిన కార్మిక సంఘం ఎన్నికల నగారా
- ఈ నెల 31న పోలింగ్‌కు కార్మిక శాఖ ఏర్పాట్లు
- కర్మాగారంలో ట్రేడ్ యూనియన్ల ప్రచార కోలాహలం



సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ కర్మాగారం

బూర్గంపాడు: ఆసియా ఖండంలోనే ప్రఖ్యాతిగాంచిన సారపాక ఐటీసీ పీఎస్‌పీడీలో గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల నగారా మోగింది. ఎన్నికల నిర్వహణకు లేబర్ కమిషనర్ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. జనవరి 31న ఎన్నికలు నిర్వహించనున్నట్లు కార్మికశాఖ అధికారులు ప్రకటించారు. అదేరోజు సాయంత్రం ఫలితాలు కూడా వెల్లడించనున్నారు.

ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ట్రేడ్ యూనియన్లు

ఎన్నికలను నాలుగు ప్రధాన ట్రేడ్ యూనియన్లు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ప్రస్తుత గుర్తింపు కార్మిక సంఘం టీఎన్‌టీయూసీతోపాటు ఐఎన్‌టీయూసీ, బీఆర్‌టీయూ, బీఎంఎస్‌లు హోరాహోరీ తలపడుతున్నాయి. ఆయా ట్రేడ్ యూనియన్లకు సంబంధిత రాజకీయ పార్టీల అండదండలు పుష్కలంగా ఉన్నాయి. ఐఎన్‌టీయూసీకి కాంగ్రెస్, టీఎన్‌టీయూసీకి తెలుగుదేశం, బీఆర్‌టీయూకు బీఆర్ఎస్, బీఎంఎస్‌కు బీజేపీలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. ట్రేడ్ యూనియన్‌లకు మద్దతుగా సంబంధిత రాజకీయ పార్టీల రాష్ట్ర నేతలు ప్రచారానికి రానున్నారు. సీఐటీయూ, ఐఈయూ ట్రేడ్ యూనియన్లు బీఆర్‌టీయూకు మద్దతు ప్రకటించి ప్రచారం సాగిస్తున్నాయి. ఏఐటీయూసీ నేరుగా పోటీ చేస్తుందా? ఇతరులకు మద్దతు ఇస్తుందా? అనే విషయంపై ఇప్పటివరకు స్పష్టత లేదు.

విస్తృతంగా ప్రచారం

గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల కోసం ఇప్పటికే ప్రధాన యూనియన్లు విస్తృత ప్రచారం సాగిస్తున్నాయి. విందు రాజకీయాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎన్నికల తేదీ ప్రకటించటంతో ప్రచారం మరింత ఊపందుకోనుంది. రాష్ట్ర మంత్రులు, ప్రతిపక్ష పార్టీల ప్రధాన నాయకులు కూడా ఈ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొనేలా ఆయా ట్రేడ్ యూనియన్ల నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

కాంగ్రెస్ మద్దతు కోసం టీఎన్‌టీయూసీ కూడా ప్రయత్నం!

అధికార కాంగ్రెస్ పార్టీ, మంత్రుల మద్దతు కోసం ఐఎన్‌టీయూసీతోపాటు టీఎన్‌టీయూసీ కూడా ప్రయత్నాలు సాగిస్తోంది. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు ట్రేడ్ యూనియన్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేశాయి. ఇప్పుడు రెండు యూనియన్లు అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రుల మద్దతు కోసం ప్రయత్నాలు చేస్తున్నాయి. మీ గెలుపు కోసం మేము పనిచేశామంటే, మీము పనిచేశామని రెండు యూనియన్ల నాయకులు ఎమ్మెల్యేలపై, మంత్రులపై ఒత్తిడి తెస్తున్నారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు కార్మికశాఖ అధికారులు ఐటీసీ పీఎస్‌పీడీ యాజమాన్యంతో కలిసి ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి గొడవలు జరగకుండా పోలీస్‌శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది.

మొత్తం 1,250 ఓట్లు

గత ఎన్నికల్లో టీఎన్‌టీయూసీ గుర్తింపు కార్మిక సంఘంగా గెలిచింది. పదవీకాలం రెండేళ్లకాగా, 2023 సెప్టెంబర్‌తో కాలపరిమితి ముగిసింది. వేతన ఒప్పందంలో ఆలస్యం తదితర కారణాలతో ఎన్నికలు సకాలంలో నిర్వహించలేదు. కర్మాగారంలోని పర్మనెంట్ కార్మికులు, బదిలీ కార్మికులు ఓటు హక్కు కలిగి ఉంటారు. కాంట్రాక్ట్ కార్మికులకు, జూనియర్, సీనియర్ మేనేజర్లకు, ఇతర ఉన్నతాధికారులకు కూడా ఓటు హక్కు ఉండదు. ఈసారి జరిగే ఎన్నికల్లో పర్మనెంట్, బదిలీ కార్మికులు 1,250 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

క్లుప్తంగా

పర్యాటకులను బంధువులుగా పరిగణించాలి


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

దుమ్ముగూడెం: పర్యాటక ప్రాంతంగా గుర్తించిన బొజ్జిగుప్పాను పర్యాటకులు సందర్శించడానికి వచ్చినప్పుడు బంధువులలాగా మర్యాదలు చేయాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని బొజ్జిగుప్ప గ్రామాన్ని సందర్శించి పర్యాటకులకు అందించే గిరిజన వంటకాలను ఆయన పరిశీలించారు. శ్రీ సీతారామచంద్రస్వామి తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే భక్తులు తప్పనిసరిగా బొజ్జిగుప్ప గ్రామాన్ని సందర్శిస్తారని, వారికి అసౌకర్యం కలగకుండా గ్రామానికి రాగానే గిరిజన సంప్రదాయ ప్రకారం ఆహ్వానించి రాచమర్యాదలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, ఆర్‌ఐ వెంకటేశ్వర్లు, ఏపీఎంలు హేమంతిని, కిశోర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సర్టిఫికెట్ అప్పగింత


సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంఈఓ

టేకులపల్లి: మండలంలోని ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌కు చెందిన బాణోతు భద్రమ్మ సోమవారం కలెక్టరేట్‌లో దరఖాస్తు ఇచ్చేందుకు అన్ని సర్టిఫికెట్లు తీసుకుని వెళ్లి తిరుగు ప్రయాణంలో బస్సులో వాటిని మర్చిపోయింది. బాధితురాలి పక్కనే కూర్చున్న గుండాల సీఆర్‌పీ విజయకుమారి సర్టిఫికెట్ల కవర్‌ని పరిశీలించి.. టేకులపల్లి ఎంఈఓకు సమాచారం ఇచ్చి మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నాకు వెళ్తూ సర్టిఫికెట్లను టేకులపల్లి ఎంఈఓ కార్యాలయంలో అప్పగించింది. సర్టిఫికెట్లను పరిశీలించి విచారించిన ఎంఈఓ అజ్మీర జగన్నాయక్ బుధవారం బాధితురాలిని పిలిపించి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో బానోత్ భాస్కర్‌రావు, చందర్‌రావు, గోపాల్‌రావు, సంధ్యారాణి పాల్గొన్నారు.

విధుల్లో నిజాయితీగా ఉండాలి

కొత్తగూడెంరూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పోలీసు కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో ఎంపికైన అభ్యర్థులు, ఇటీవల తొమ్మిది నెలల శిక్షణ పూర్తి చేసుకొన్న 168 మంది కానిస్టేబుల్ అభ్యర్థులు బుధవారం 6వ బెటాలియన్ చాతకొండలో రిపోర్టు చేశారు. నూతన కానిస్టేబుళ్లకు కమాండెంట్ డి.శివప్రసాద్‌రెడ్డి సూచనలిచ్చారు. విధి నిర్వహణలో నిజాయితీగా ఉంటూ అవినీతికి తావు లేకుండా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఏ.అంజయ్య, డి.శ్రీనివాసరావు, హెచ్.అబ్దుల్‌రషీద్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమాచార హక్కు సంరక్షణ చట్టం 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను అదనపు కలెక్టర్ వేణుగోపాల్ బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహ్మద్ రియాజ్, బొందుగుల జ్యోతి, దుర్గభవాని, బండి రాజుగౌడ్, భాషా, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

40 మంది బైండోవర్

ములకలపల్లి: గతంలో పేకాట, కోడి పందేలు నిర్వహిస్తూ పోలీసులకు పట్టుబడిన 40 మందిని బుధవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రాజశేఖర్ వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నాటుకోళ్లు చోరీ చేశారని ఫిర్యాదు

ములకలపల్లి: నాటుకోళ్ల చోరీకి పాల్పడిన వ్యక్తులపై మాధారం గ్రామానికి చెందిన ముదిగొండ హరనాథబాబు స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. బాధితుని కథనం మేరకు.. మంగళవారం అర్ధరాత్రి కుక్కలు మొరుగుతుండటంతో హరనాథబాబు మేల్కొని ఇంటి ఆవరణ పరిశీలించారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి పెరటిలోని గంపకింద నాటు కోడిపుంజులను తీసుకొని వెళ్తుండగా వెంబడించి పట్టుకున్నారు. ఇంటి సమీపంలో ఉంచిన ద్విచక్ర వాహనాన్ని సైతం స్వాధీనం చేసుకున్నారు. డయల్ 100కు ఫోన్ చేయడంతో స్థానిక పోలీసులు వచ్చి నిందితుడితో పాటు బైక్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బుధవారం లిఖితపూర్వక ఫిర్యాదు చేసినట్లు హరనాథబాబు తెలిపాడు. ఎస్‌ఐ రాజశేఖర్‌ను సంప్రదించగా విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,506


పడవపై తెప్పోత్సవం


హంసాకృతి వాహనంపై నదీ విహారం


శేషపాన్పు అలంకరణలో ఇలా..

ఆ పాత మధురాలు!

భద్రగిరిలో ఏడు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న తెప్పోత్సవం


పడవపై తెప్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు


ప్రస్తుతం ఇలా..

దక్షిణ అయోధ్యగా, భూలోక వైకుంఠంగా భక్తులు భావించే భద్రాచలంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవం ప్రధానమైనది. ఉత్తర ద్వార దర్శనానికి ముందు రోజు రాత్రి గోదావరిలో హంస వాహనంపై మిరుమిట్లు గొలిపే బాణాసంచా, విద్యుత్ దీపాలతో సీతాలక్ష్మణ సమేత రామచంద్రస్వామి వారు 'లాహిరి లాహిరి.. లాహిరిలో' అంటూ విహరించే దృశ్యాలు మరువలేనివి. భద్రాచలం వచ్చినభక్తులు తెప్పోత్సవాన్ని కనులారా వీక్షించి, మరుసటి రోజు తెల్లవారుజామున ఉత్తర ద్వారం ద్వారా రామయ్యను దర్శించుకుని మది నిండా మధురానుభూతులతో ఇంటిబాట పడతారు. అయితే 1951లో ప్రారంభమైన ఈ తెప్పోత్సవం మొదట పడవలలో, ఆదిశేషుని శేషపాన్పు ఆకారంలో, ఆ తర్వాత హంసాకృతిలో అలంకరించిన లాంచీలో నిర్వహించేవారు. ప్రస్తుతం కళ్లు మిరుమిట్లు గొలిపే బాణసంచా వెలుగుల నడుమ ఈ వేడుకను జరుపుతున్నారు. కొన్ని దశాబ్దాలుగా తెప్పోత్సవ దృశాలు భక్తుల కోసం. – భద్రాచలం

గురుకులాలు పిలుస్తున్నాయి..

- ఉమ్మడి జిల్లాలో 48 గురుకుల విద్యాలయాలు
- 3,840 మంది విద్యార్థులకు ప్రవేశం
- 5 తరగతితో పాటు 6 నుంచి 9 వరకు ఖాళీలకు పరీక్ష


నేలకొండపల్లి గురుకుల పాఠశాల

నేలకొండపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్‌స్థాయిలో విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలను నెలకొల్పింది. ఆంగ్ల మాధ్యమంలో ఉత్తమ బోధన అందించడం, ఇక్కడ చదివే విద్యార్థులు వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతుండటంతో ఏటా వీటిలో ప్రవేశాలకు పోటీ అధికంగా ఉంటోంది. 2025–26 విద్యా సంవత్సరానికి 5 నుంచి 9 తరగతిలో ప్రవేశాలకు గురుకులాల సంస్థ ప్రకటన విడుదల చేసింది. దీంతో దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా చేయాల్సి ఉంటుంది. గతంలో విద్యార్థి ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, ఫొటో సంతకం ఉంటే సరిపోయేది. ఈసారి కుల, ఆధాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు బోనఫైడ్ సర్టిఫికెట్లను కూడా జత చేయాలని ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో 5వ తరగతి ప్రవేశాలకు ఒకసారి, ఆరు నుంచి 9 తరగతులకు మరోసారి దరఖాస్తులు స్వీకరించే వారు. అర్హత పరీక్ష వేర్వేరు తేదీల్లో నిర్వహించే వారు. ప్రస్తుతం అన్ని తరగతులకు ఒకేసారి ప్రవేశ ప్రక్రియ చేపట్టారు. అర్హత పరీక్ష అన్నీ కూడా ఒకే రోజు నిర్వహించేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు.

ప్రతీ గురుకులంలో 80 సీట్లు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలు మొత్తం 22 ఉండగా, బీసీ గురుకులాలు మొత్తం 26 ఉన్నాయి. వీటిలో ప్రతీ గురుకులానికి 80 సీట్లు చొప్పున జిల్లావ్యాప్తంగా 5వ తరగతిలో 3,840 సీట్లు ఖాళీలున్నాయి. వీటిని భర్తీ చేసేందుకు ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. వీటి కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి 1 వరకు గడువు ఉంది. ఇక మిగిలిన 6, 7, 8, 9 తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు కూడా అదే రోజు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.

ఇవి కావాలి..

- వచ్చే విద్యా సంవత్సరానికి గురుకులంలో ఆయా తరగతులకు దరఖాస్తు చేయాలనుకునే విద్యార్థులు మీ సేవ కేంద్రాల ద్వారా ముందుగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను తీసుకోవాలి.
- విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి బోనఫైడ్ లేదంటే జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా తీసుకోవాల్సిందే.
- ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్, (ఓటీపీ కోసం), విద్యార్థి ఫొటో కావాల్సి ఉంటుంది.
- గ్రామీణ ప్రాంతాల వారి వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ వాసులకు రూ.2 లక్షలలోపు ఉండాలి.

కలెక్టర్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్..

గురుకులాల్లో ప్రవేశాల కోసం సమాచారం అందించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్లు జారీ చేసేందుకు అందుబాటులో ఉంచారు. ప్రవేశాలకు విస్తృతంగా ప్రచారం కల్పించేందుకు ఎంపీడీఓ, ఎంపీఓలకు బాధ్యతలు అప్పగించారు. ప్రతీ గ్రామ పంచాయతీలో విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు.

విస్తృత ప్రచారం చేస్తున్నాం..



విద్యార్థులకు మంచి అవకాశం దొరికింది. తల్లిదండ్రులు వెంటనే ఆన్‌లైన్‌లో గురుకులాలకు దరఖాస్తు చేసుకుని విద్యార్థులకు సీట్లు సాధించి వారి భవిష్యత్ మారేలా చేసుకోవాల్సిన అవసరం ఉంది. అందుకే గ్రామాల్లో వివిధ రూపాలలో ప్రచారం చేయిస్తున్నాం.

– ఎం.ఎర్రయ్య, ఎంపీడీఓ, నేలకొండపల్లి

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి..



గురుకులంలో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మీ సేవ కేంద్రాలకు వెళ్తే సులభంగా ధ్రువీకరణ పత్రాలు పొందవచ్చు. గురుకులాల్లో చేరి, విద్యావంతులై ఉన్నస్థాయికి చేరుకోవాలి.

– పద్మావతి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, నేలకొండపల్లి

ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



ప్రభుత్వం గురుకులాలపై ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా మెనూలో భారీ మార్పులు చేసింది. కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించే విధంగా చర్యలు తీసుకుంది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు గురుకులాలు ఓ వరం లాంటిది.

– బచ్చలకూరి నాగరాజు, సేవాదళ్ కన్వీనర్

సింగరేణి క్యాలెండర్ ప్రగతికి ప్రతీక


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

మణుగూరుటౌన్: సింగరేణీయులందరికీ ప్రేరణ కలిగేలా, నూతనోత్సాహం కలిగించేలా కంపెనీ సాధిస్తున్న బహుముఖ ప్రగతికి, సామాజిక సేవలకు కొత్త క్యాలెండర్ ప్రతీకగా నిలుస్తుందని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. బుధవారం జీఎం సమావేశ మందిరంలో సింగరేణి నూతన సంవత్సర క్యాలెండర్‌ను యూనియన్ నాయకులు, పలు విభాగాల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్యాంసుందర్, ఆర్.శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వెంకట్రావ్, రమేశ్, శ్రీనివాసమూర్తి, అనురాధ, వై.రాంగోపాల్, కృష్ణంరాజు పాల్గొన్నారు.

కేసు నమోదు

దమ్మపేట: గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న సమావేశానికి వెళ్లిన వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన మండలంలోని ముష్టిబండ గ్రామంలో చోటుచేసుకుంది. ముష్టిబండ గ్రామానికి చెందిన కవులూరి ముత్తారావు (47), మంగళవారం అదే గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న సమావేశానికి వెళ్లాడు. సాయంత్రం వరకు ఆ వ్యక్తి, ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

ఉద్యోగాల పేరిట ఘరానా మోసం

కామేపల్లి: సింగరేణిలో పర్మనెంట్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.1.50 కోట్లు వసూల్ చేశాడో సబ్‌స్టేషన్ ఆపరేటర్. బుధవారం తాళ్లగూడెంలో విలేకర్ల సమావేశంలో బాధితులు వివరాలు వెల్లడించారు. ముచ్చర్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్న గోవింద్రాల గ్రామానికి చెందిన బోడా మంగ్యాజీనాయక్ కామేపల్లి, కారేపల్లి మండలాలకు చెందిన పలువురు నిరుద్యోగులకు సింగరేణిలో పర్మనెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి ఒక్కొక్కరి వద్ద రూ.2 నుంచి 6 లక్షల మేర వసూలు చేశాడు. కొంతకాలానికి ఇంటర్వ్యూకు వెళ్లాలని సూచించడంతో అక్కడికి వెళ్తే ఎవరూ లేరని, మోసపోయామని గుర్తించామని తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ, ఈ విషయాన్ని బయటకు తెలియకుండా పోలీసులు గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది. మంగ్యాజీనాయక్ విద్యుత్ శాఖలో పనిచేస్తూ, ఓ గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడిగా, ఓ పీడీఎఫ్ పత్రికలో రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడని, పోలీసులు, విద్యుత్‌శాఖ అధికారులు అతడిపై చర్యలు తీసుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు. ఎస్‌ఐని వివరణ అడగగా కేసు నమోదు చేసి విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆధార్ ఆధారిత లావాదేవీలో టోకరా

కరకగూడెం: ఆధార్ ఆధారిత లావాదేవీలో ఓ రైతు డబ్బులు పోగొట్టుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. చిరుమళ్ల గ్రామానికి చెందిన బాధిత రైతు చందాప్రసాద్ కథనం ప్రకారం.. ఈ నెల 7న డబ్బులు అవసరం ఉండి స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంకు (టీజీబీ)కు వెళ్లగా అక్కడ డబ్బులు లేకపోవడంతో ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్ (ఏఈపీఎస్) ఏజెంట్ వద్దకు వెళ్లాడు. అక్కడ రెండు సార్లు వేలి ముద్రలు పెట్టి రూ.6 వేలు నగదు తీసుకునే ప్రయత్నం చేయగా.. డబ్బులు రావడం లేదని ఏజెంట్ చెప్పాడు. మరుసటి రోజు బుధవారం స్థానిక టీజీబీకి వెళ్లి ఖాతా పరిశీలించగా నగదు లేకపోగా.. వేలిముద్రలు పెట్టిన చోటే విత్‌డ్రా అయినట్లు తేలింది. దీంతో బాధితుడు సదరు ఏజెంట్ వద్దకు వెళ్లగా అందుబాటులో లేకుండాపోయాడు.

అర్హత లేని వైద్యులతో నడుపుతున్న ఆస్పత్రి సీజ్

కొత్తగూడెంరూరల్ : పట్టణంలో అనుమతి లేని వైద్యులతో నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిని బుధవారం సీజ్ చేశారు. డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు డిప్యూటీ డెమో ఫైజ్ మొయిద్దీన్, ప్రోగ్రామ్ అధికారి ఎం.మధువరన్ ఆస్పత్రిని తనిఖీ చేశారు. అర్హత లేని వ్యక్తులు వైద్యం చేస్తుండడాన్ని గమనించి సీజ్ చేసినట్లు వారు తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో రక్త పరీక్ష, డయాగ్నస్టిక్ కేంద్రాలకు అనుమతులు ఉన్నా.. అనర్హులు వైద్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాపర్ తీగ చోరీ

దమ్మపేట: ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌తీగను గుర్తు తెలియని దుండగులు చోరీ చేసిన ఘటన మండలంలోని మందలపల్లి శివారులోని పామాయిల్ క్షేత్రంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అడపా సుబ్బారావుకు అదే గ్రామంలోని పామాయిల్ వ్యవసాయ క్షేత్రం ఉంది. సోమవారం ఆ క్షేత్రంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని 6 కేజీల కాపర్ తీగలను దుండగులు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి


ఘటనా స్థలంలో బైక్, బస్సు

బూర్గంపాడు: మండలంలో బుధవారం చోటుచేసుకున్న వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కృష్ణసాగర్ క్రాస్‌రోడ్డు వద్ద ఆర్టీసీ అద్దె బస్సు ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో మోటార్ సైకిల్ నడుపుతున్న కొత్తగూడెం కూలీబస్తీకి చెందిన రాంకుమార్ హరిప్రసాద్(46) అక్కడికక్కడే మృతిచెందాడు. హరిప్రసాద్ ప్రస్తుతం బూర్గంపాడు మండలంలోని సందెళ్ల రామాపురంలో ఉంటూ సారపాక ఐటీసీ పీఎస్‌పీడీలో క్యాజువల్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఎస్‌ఐ రాజేశ్ ఘటనా ప్రాంతానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య స్నేహ, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ వద్ద బుధవారం ఉదయం మోటార్‌సైకిల్‌ను లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో మోటార్‌సైకిల్‌పై ఉన్న రేగులగూడెం గ్రామానికి చెందిన పాలెబోయిన ప్రవీణ్, అతని తల్లి శాంతకు తీవ్ర గాయాలయ్యాయి. వీరు సారపాక నుంచి భద్రాచలం వెళ్తున్న క్రమంలో ఐటీసీ వద్ద యూ టర్న్ తీసుకున్న లారీ ఢీ కొట్టింది. క్షతగాత్రులను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు తరలించారు. క్షతగాత్రురాలి భర్త వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ప్రమాదంలో వ్యక్తి..

అశ్వాపురం: మండలంలోని బీజీ కొత్తూరు గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలయ్యాయి. మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన మద్ది శంకర్‌రెడ్డి (72), మొండికుంట గ్రామానికి చెందిన గూడూరు జనార్దన్‌రెడ్డి మోపెడ్‌పై మొండికుంట వస్తున్నాడు. బీజీ కొత్తూరు వద్ద లారీ, ట్రాక్టర్‌లు కర్రలోడ్‌తో వస్తుండగా లారీ ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో ట్రాక్టర్ మోపెడ్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన శంకర్‌రెడ్డి ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మరో వ్యక్తి జనార్దన్‌రెడ్డి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. ఎస్‌ఐ రవూఫ్ లారీని, ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ పైనుంచి జారిపడి డ్రైవర్...

బూర్గంపాడు: సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ ఉడ్ యార్డులో బుధవారం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి జారిపడి డ్రైవర్ మృతిచెందాడు. స్లిప్‌టింగ్ మిషన్‌ను కలిగిన ట్రాక్టర్‌ను డ్రైవ్ చేస్తున్న కోణాల తంబి జోసఫ్ (45) ప్రమాదవశాత్తు సీటు పైనుంచి జారిపడ్డాడు. తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని యువకుడు దుర్మరణం


గణేశ్ (ఫైల్)

మణుగూరుటౌన్: రైలు ఢీకొని ఓ యువకుడు దుర్మరణం పాలైన ఘటన మండలంలోని కూనవరంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కూనవనానికి చెందిన ఏనిక గణేశ్ (20) మిషన్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం పనికి వెళ్లి సాయంత్రం వేళ ఇంటికి వచ్చి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం తెల్లవారుజామునే దగ్గరలోని రైల్వే ట్రాక్‌పై మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. రైలు అతడి పైనుంచి వెళ్లడంతో గణేశ్ అక్కడికక్కడే మృతి చెందిన ఆనవాళ్లు ఉండగా, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడికి మద్యం సేవించే అలవాటు ఉండటంతో మద్యం సేవించి ట్రాక్‌పై నిద్రించాడా లేక ట్రాక్ దాటుతున్న క్రమంలో రైలు ఢీకొని ప్రమాదం జరిగిందా అన్నది తెలియరాలేదు. కాగా, మృతదేహాన్ని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సందర్శించి నివాళులర్పించారు.

పాఠశాలలో నాగుపాము హల్‌చల్


పామును పట్టుకున్న సంగయ్య

పాల్వంచ: ప్రభుత్వ పాఠశాలలో నాగుపాము కనిపించడంతో విద్యార్థులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. బుధవారం పట్టణంలోని కొమ్ముగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంటగది, భోజన శాలలో విద్యార్థులు అప్పుడే అల్పాహారం తిని తరగతి గదులకు వెళ్లిన తర్వాత నాగుపాము బయటకు రావడంతో సిబ్బంది గుర్తించారు. వెంటనే పాఠశాల ఉపాధ్యాయులు స్నేక్ క్యాచర్ సంగయ్యకు సమాచారం అందించారు. సంగయ్య పామును చాకచక్యంగా పట్టుకుని అటవి ప్రాంతంలో వదిలిపెట్టారు. ఎవరికి ప్రమాదం జరగక పోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

బ్లేడ్‌తో మెడ కోసుకున్న వ్యక్తి

టేకులపల్లి: బ్లేడ్‌తో మెడను కోసుకున్న ఓ వ్యక్తిని స్థానికులు ఆస్పత్రికి తరలించిన ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని రోళ్లపాడు గ్రామానికి చెందిన చీమల వెంకటరత్నం – వెంకటమ్మ దంపతుల మూడో కుమారుడు చీమల రామస్వామి కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తిగా ప్రవర్తిస్తున్నాడు. బుధవారం బ్లేడుతో మెడ కోసుకున్నాడు. స్థానికులు ఇల్లెందు ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మద్యం మత్తులో దాడి


బుకింగ్ ఏజెంట్‌పై దాడి చేస్తున్న దృశ్యం

పాల్వంచ: మద్యం మత్తులో ట్రావెల్ బుకింగ్ ఏజెంట్‌పై దాడి చేసిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బీసీఎం రోడ్డులోని భవాని ట్రావెల్ ఏజెంట్ బుకింగ్ నిర్వాహకుడు షణ్ముఖ వద్ద హైదరాబాద్ వెళ్లేందుకు నగేశ్, శ్యామ్ బస్సు టికెట్‌ను బుక్‌చేశారు. ఈ క్రమంలో టికెట్‌బుక్ చేసుకున్న ఓ వ్యక్తి మద్యం సేవించి బస్సు ఎక్కడంతో డ్రైవర్ అభ్యంతరం వ్యక్తంచేశాడు. దీంతో షణ్ముఖ టికెట్లు ఇచ్చి డబ్బులు వాపస్ తీసుకోండని చెప్పడంతో ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. షణ్ముఖ ఫిర్యాదు మేరకు దాడి చేసిన నగేశ్, ఉపేందర్, హతిరామ్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.